ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 258 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 19 ఏప్రిల్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

ఆధ్యాత్మిక యాత్రికులపై సైబర్ నేరగాళ్ల కన్ను.. కేంద్రం అలర్ట్!

ఆధ్యాత్మిక యాత్రికులపై సైబర్ నేరగాళ్ల కన్ను పడింది. వారిని లక్ష్యంగా చేసుకొని దేశవ్యాప్తంగా సైబర్ మోసాలు జరుగుతున్నాయంటూ కేంద్రం హెచ్చరించింది.

ఢిల్లీ, ఏప్రిల్ 19, (రిపబ్లిక్ న్యూస్): దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆధ్యాత్మిక పర్యటకంపై సైబర్ నేరగాళ్ల కన్నుపడింది. ఈ పర్యటనకు వెళ్లేవారే లక్ష్యంగా ఆన్లైన్ కేటుగాళ్లు ఉచ్చులు పన్నుతున్నారు. ఫేక్ వెబ్సైట్లు, ఫేస్బుక్ పోస్టులు, గూగుల్ వంటి సెర్చింజన్లలో నకిలీ పెయిడ్ అడ్వర్టైజ్మెంట్లతో బోల్తా కొట్టిస్తున్నారు. ఈ విషయాలు కేంద్రం దృష్టికి రావడంతో అప్రమత్తమైంది. ఛార్దామ్ యాత్రికులు, ఇతర పర్యటకులే లక్ష్యంగా ఈ మోసాలు జరుగుతున్నాయని పేర్కొంది. ఈమేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ పౌరులను అప్రమత్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. పర్యటకానికి సంబంధించి సేవలందిస్తామన్న పేరుతో నకిలీ వెబ్సైట్లను సృష్టించడం, సోషల్మీడియా ప్రొఫైళ్లు, వాట్సప్ అకౌంట్ల నుంచి సందేశాలు పంపుతున్నట్లు కేంద్రం దృష్టికి వచ్చింది.

ముఖ్యంగా కేదార్నాథ్ యాత్రికులకు హెలికాప్టర్ బుకింగ్లు, ఛార్ధామ్ యాత్రికులకు అతిథిగృహాలు, హోటల్ బుకింగ్స్, ఆన్లైన్ క్యాబ్, ట్యాక్సీ బుకింగ్, హోలిడే ప్యాకేజీల పేరిట ఈ మోసాలు జరుగుతున్నాయని సైబర్ క్రైమ్ విభాగం పేర్కొంది. ఈ మోసపూరిత వెబ్సైట్లను నమ్మి చెల్లింపులు చేసినవారికి సేవలకు సంబంధించిన సందేశాలు రాకపోగా.. వారిచ్చిన కాంటాక్ట్ నంబర్లను సంప్రదించినప్పుడు స్పందన ఉండడం లేదన్నారు. కాబట్టి ఆధ్యాత్మిక పర్యటకులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ విభాగం సూచించింది. 'స్పాన్సర్డ్ పేరుతో ఉండే లింకులు, ఫేస్బుక్, వాట్సప్ లో వచ్చే లింకులను క్లిక్ చేసే ముందు అవి అసలైనావా? నకిలీవా? ధ్రువీకరించుకోవాలని సూచించింది. వీలైనంతవరకు ప్రభుత్వ అధికారిక వెబ్సైట్లను లేదా నమ్మదగిన ప్రైవేటు ఏజెన్సీలను ఆశ్రయించాలని సూచించింది. ఇలాంటి ఘటనలు ఏవైనా పౌరుల దృష్టికి వస్తే cybercrime. gov.in పోర్టల్ లో లేదా 1930కు కాల్ చేసి రిపోర్ట్ చేయాలని సూచించింది. ఇలాంటి మోసాలు జరగకుండా కేంద్రం కూడా తమవంతుగా గూగుల్, వాట్సప్, ఫేస్బుక్ సమన్వయం చేసుకొని చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది.

చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం: మంత్రి ఆనం

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ పుట్టినరోజు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు.

అమరావతి, ఏప్రిల్ 19, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ పుట్టినరోజు (ఏప్రిల్ 20) వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నాయకులంతా వారి ప్రాంతాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించాలని కోరారు. చంద్రబాబు నిండు నూరేళ్లు ఆనందంగా ఉండాలని కోరుకోవాలన్నారు. అన్ని మతాల వారు తెదేపా కార్యకర్తలు, నేతలుగా ఉన్నారన్న ఆయన.. మసీదులు, చర్చిల్లోనూ ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. దేశ ఔన్నత్యాన్ని చాటుతూ చంద్రబాబు కోసం పూజలు, ప్రార్థనలు చేయాలన్నారు. చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ఆత్మకూరులో పెద్ద ఎత్తున హోమం చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు.

ఢిల్లీ పరిస్థితిని చూసి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా?: సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్, ఏప్రిల్ 19, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన.. అక్కడి తెలుగు సమాఖ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణాలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. "టోక్యోలో అభివృద్ధి చేసిన రివరంట్ను పరిశీలించాం. మూసీ నది ప్రక్షాళనకు కొంత మంది అడ్డుపడుతున్నారు. దిల్లీ పరిస్థితిని చూసి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా? మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకం. తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. రాష్ట్ర అభివృద్ధిలో అందరి సహకారం అవసరం. మీ తోడ్పాటుతో ప్రపంచంతోనే మనం పోటీ పడొచ్చు. ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు తెలుసు" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

నెగ్గిన అవిశ్వాస తీర్మానం..

జీవీఎంసీ మేయర్ పీఠం కూటమిదే

మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై 'కూటమి' ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది.

విశాఖ, ఏప్రిల్ 19, (రిపబ్లిక్ న్యూస్): మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై 'కూటమి' ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఈ ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ఇన్ఛార్జ్ కమిషనర్, కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. వైకాపా కార్పొరేటర్లు ఒక్కొక్కరిగా పార్టీని వీడడంతో 'కూటమి' బలం పెరిగింది. జీవీఎంసీలో మొత్తం 97 మంది సభ్యులు ఉన్నారు. సమావేశానికి ఎక్అఫీషియో సభ్యులతో కలిపి 74 మంది కూటమి సభ్యులు హాజరయ్యారు. వీరంతా అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేయగా.. కౌన్సిల్ సమావేశాన్ని వైకాపా సభ్యులు బహిష్కరించారు. దీంతో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పదవీని కొల్పోయ్యారు.

కూటమి నేతల సంబరాలు..

వైకాపా మేయర్ పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జీవీఎంసీ కార్యాలయం వద్ద కూటమి నేతలు సంబరాల్లో మునిగితేలారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి వేడుకలు చేసుకున్నారు.

గోశాల మాజీ డైరెక్టర్ పై కచ్చితంగా చర్యలు

తీసుకుంటాం:తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు

వైకాపా హయాంలో గోవుల గడ్డిని కూడా తినేశారని తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు మండిపడ్డారు.

తిరుపతి, ఏప్రిల్ 19, (రిపబ్లిక్ న్యూస్): వైకాపా హయాంలో గోవుల గడ్డిని కూడా తినేశారని తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు మండిపడ్డారు. గోశాలలోని గోవులను ఒంగోలుకు తరలించి కమీషన్లకు అమ్మేశారని ఆరోపించారు. తిరుపతిలో తితిదే గోసంరక్షణశాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి అక్రమాలు అన్నీఇన్నీ కావన్నారు. ఆయన బాగోతం బయటపడుతుందని రికార్డులు ఎత్తుకెళ్లారని విమర్శించారు. "భాజపా నేత సుబ్రమణ్యస్వామికి గోశాలలో అన్యాయాలు కనిపించలేదా? వైకాపాపై ఆయన ఎందుకు పిల్ వేయలేదు? తితిదే అంటేనే ఒంటికాలిపై లేచే సుబ్రమణ్యస్వామి నిజానిజాలు ఏంటో తెలుసుకోరా? గోశాలలో నలుగురు సభ్యులతో కూడిన కమిటీ వేస్తాం. ఇక్కడ ఏం జరుగుతోందన్నది కమిటీ తేలుస్తుంది. వైకాపా చేసిన తప్పును మాపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. తప్పు చేసిన వారు తప్పించుకోలేరు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తా. తితిదే గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డిపై కచ్చితంగా చర్యలు ఉంటాయి" అని బీఆర్ నాయుడు తెలిపారు.

జమ్మూకశ్మీర్‌లో ప్రొఫెసర్ పై సైనికుల దాడి..

విచారణ చేపట్టిన ఆర్మీ

జమ్మూకశ్మీర్‌లో తనపై పలువురు ఆర్మీ సిబ్బంది దాడి చేశారంటూ ఒక ప్రొఫెసర్ చేసిన ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టారు.

జమ్మూకశ్మీర్, ఏప్రిల్ 19, (రిపబ్లిక్ న్యూస్): జమ్మూకశ్మీర్‌లో వాహనాల తనిఖీ సమయంలో కొందరు సైనికులు తనపై దాడి చేశారని యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు ఆరోపించారు. దీనిపై భారత సైన్యాధికారులు విచారణ చేపట్టారు. రాజౌరీ జిల్లాలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో)లో లియాఖత్ అలీ ప్రొఫెసర్ పనిచేస్తున్నారు. ఆయన మరికొందరితో కలిసి ఒక వివాహ వేడుకకు హాజరై కలకోట్కు తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్మీ సిబ్బంది తనపై దాడి చేశారని అలీ ఆరోపించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. 'నా కుటుంబంలోను ఎంతోమంది సైన్యంలో ఉన్నారు. అందుకు నేను ఎంతో గర్వపడతాను. కానీ, ఈ రోజు జరిగిన ఘటన ఆ గౌరవాన్ని తగ్గించింది. వారు నా గుర్తింపుకార్డును చూపించమన్నారు.

అది చూపించేందుకు కారు దిగుతున్న నాపై అనూహ్యంగా దాడి చేశారు. వారి ఆయుధాలతో నా తలపై కొట్టి గాయపరిచారు. దీనికి వాళ్లు నాకు క్షమాపణ కూడా చెప్పలేదు. సైన్యం మన దేశానికి గర్వకారణం. నాకు న్యాయం జరగాలి' అని ప్రొఫెసర్ పేర్కొన్నారు. తన తలకు ఆరుకుట్లు పడినట్లు ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెల్లడించారు. ఇక, దీనిపై ఆర్మీ అధికారులు స్పందించారు. ఉగ్రవాద కదలికలపై సమాచారం అందడంతో సైనిక సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకుందని వెల్లడించారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. అయితే, తనిఖీ సమయంలో ఆ వ్యక్తి విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి ఆయుధాలు లాక్కునేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయన సిబ్బందితో గొడవ పడినట్లు వెల్లడించారు. దీనిపై పూర్తి విచారణ జరిపి, సిబ్బంది ఎవరైనా దురుసుగా ప్రవర్తించినట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనను పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి ఖండించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్మీని కోరారు. జమ్మూకశ్మీర్ భాజపా మాజీ అధ్యక్షుడు రవీందర్ రైనా కూడా దీనిపై స్పందించారు. మన దేశంలో చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. దాడి ఎవరు చేసినా వారు తగిన పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని ప్రొఫెసర్కు హామీ ఇచ్చారు.

2 వేల మంది రీపోస్టు చేశారు..

వారిపై చర్యలు తీసుకుంటున్నారా?:స్మితా సభర్వాల్

ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

హైదరాబాద్, ఏప్రిల్ 19, (రిపబ్లిక్ న్యూస్): ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కంచ గచ్చిబౌలి భూముల అంశంలో ఆమెకు ఈనెల 12న నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. పోలీసులకు పూర్తిగా సహకరించినట్లు తెలిపారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు చెప్పారు. తాను రీపోస్టు చేసినట్లే రెండు వేల మంది చేసినట్లు పేర్కొన్నారు. వాళ్లందరిపైనా ఇలాంటి చర్య తీసుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానమా.. ? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా..? అని స్మితా సభర్వాల్ అడిగారు. కంచ గచ్చిబౌలిలో వన్యప్రాణుల పరిస్థితి ఇదంటూ వైరల్ అయిన నకిలీ ఫొటోలను ఆమె సోషల్మీడియాలో షేర్ చేసిన నేపథ్యంలో పోలీసులు నోటీసులు ఇచ్చారు.

బలం లేదు కాబట్టే అభ్యర్థిని పోటీలో పెట్టలేదు:కేటీఆర్

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌కు భారాస దూరంగా ఉంటుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 19, (రిపబ్లిక్ న్యూస్): హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్కు భారాస దూరంగా ఉంటుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్లో నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ భారాస నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలం లేదు కాబట్టే అభ్యర్థిని పోటీలో పెట్టలేదని చెప్పారు.

ఎన్నికకు హాజరు కావద్దని పార్టీ తరపున విప్ కూడా జారీ చేస్తామని చెప్పారు. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీకి కాంగ్రెస్, భారాస దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. "కాంగ్రెస్, తెదేపా, భాజపాను ఎదుర్కొని కేసీఆర్ పార్టీ పెట్టారు. కేసీఆర్ దీక్ష, పోరాటంతోనే తెలంగాణ వచ్చింది. ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా భారాస సమర్థంగా పోషిస్తుంది. చేసినవి చెప్పుకోనందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. 17 నెలల్లో భారాస గ్రాఫ్ బాగా పెరిగింది. ప్రస్తుత ప్రభుత్వం హైడ్రా, మూసీ, హెచ్సీయూ భూముల పేరుతో అరాచకాలు చేస్తోంది. రాష్ట్ర భాజపా ఎంపీలు కాంగ్రెస్ను ఒక్క మాట కూడా అనరు. 17 నెలల్లో తెలంగాణకు భాజపా ఒక్క పైసా పని చేయలేదు. హెచ్సీయూ భూములపై మోదీ ఎందుకు విచారణ జరిపించట్లేదు? తెలంగాణ కాంగ్రెస్, భాజపా ఒక్కటే మతం పేరిట రాజకీయాలను తెలంగాణ ప్రజలు ఆమోదించరు" అని కేటీఆర్ తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1882 :** ఇంగ్లాండుకు చెందిన ప్రకృతివాది, జీవపరిణామ సిద్ధాంత కర్త చార్లెస్ డార్విన్ మరణం (జ.1809).
- **1906 :** భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత పియరీ క్యూరీ మరణం (జ. 1859).
- **1957 :** రిలయన్స్ కంపెనీ అధినేత ముకేష్ అంబానీ జననం. (చిత్రంలో)
- **1969 :** భాషా పరిశోధకుడు. విజ్ఞాన సర్వస్వ నిర్మాత గిడుగు వేంకట సీతాపతి మరణం (జ.1885).
- **1971 :** మొదటి అంతరిక్ష కేంద్రం సాల్యూట్ 1 ప్రయోగం.
- **1975 :** భారత తొలి అంతరిక్ష ఉపగ్రహం ఆర్యభట్టను సోవియట్ భూభాగం నుంచి ప్రయోగించారు.
- **1977 :** ప్రపంచ ఛాంపియన్‌షిప్ అథ్లెటిక్స్ పోటీలలో కాంస్య పతకం విజేత అంజు బాబీ జార్జ్ జననం.
- **2006 :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న మరణం (జ.1909).

చార్లెస్ డార్విన్

పియరీ క్యూరీ

ముకేష్ అంబానీ

గిడుగు వేంకట సీతాపతి

సాల్యూట్ 1

ఆర్యభట్టను సోవియట్

అంజు బాబీ జార్జ్

సర్దార్ గౌతు లచ్చన్న

కోలీవుడ్‌లో మొదట అలా చేసింది నా తనయుడే.. :తండ్రి మాటలతో సూర్య ఎమోషనల్

సూర్య హీరోగా కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన చిత్రం 'రెట్రో'. శుక్రవారం సాయంత్రం ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం చెన్నైలో జరిగింది.

సూర్య హీరోగా కార్తిక్ సుబ్బరాజు రూపొందించిన చిత్రం 'రెట్రో. రొమాంటిక్ యాక్షన్ ఫిల్మ్ గా ఇది సిద్ధమైంది. పూజా హెగ్డే కథానాయిక. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం శుక్రవారం సాయంత్రం చెన్నై వేదికగా జరిగింది. ఇందులో పాల్గొన్న సూర్య తండ్రి, నటుడు శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన తనయుడు ఎంతో శ్రమించి ఈ స్థాయికి వచ్చాడని అన్నారు. కెరీర్ ఆరంభంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాడని గుర్తు చేశారు. "కెరీర్ ఆరంభం నుంచి మా అబ్బాయి ఎంతో కష్టపడ్డాడు. నేడు ఈ స్థాయికి వచ్చాడు. ఎంతోమంది అభిమానాన్ని సొంతం చేసుకున్నాడు. ఒకానొక సమయంలో నాన్నాప్ నాలుగు గంటలపాటు డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తుండేవాడు. తెల్లవారుజామున నాలుగు గంటలకే నిద్ర లేచి బీచ్కు వెళ్లి స్టంట్స్ నేర్చుకునేవాడు. నిజాయతీగా మరో విషయం చెబుతున్నా. నా తనయుడి కంటే ముందు కోలీవుడ్లో ఎవరూ కూడా సిక్స్ ప్యాక్ ట్రై చేయలేదు. సినిమాల కోసం అలాంటి బాడీ ట్రై చేసిన మొదటి వ్యక్తి మా అబ్బాయి. మా అబ్బాయి విషయంలో నేనెంతో గర్వపడుతున్నా" అని శివకుమార్ తెలిపారు. తండ్రి మాటలతో అక్కడే ఉన్న సూర్య ఎమోషనల్ అయ్యారు. అనంతరం సూర్య మాట్లాడుతూ.. 'రెట్రో' సినిమా చేయడం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. "జీవితం ఎంతో అందమైంది. దానిని నమ్మండి. జీవితం మనకెన్నో అందమైన ఫలాలను అందిస్తుంది. ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవద్దు. ఎలాంటి రిస్కులు అయినా తీసుకునే వయసు ఇదే. మన జీవితానికి సంబంధించిన ముఖ్య ఉద్దేశం ఏమిటనే దాని గురించి ఆలోచింపజేసే చిత్రమిది. నేను అయితే అగరం ఫౌండేషన్ కోసం జీవిస్తున్నా. ఆ సంస్థ వల్ల సుమారు 8 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వాళ్లందరి భవిష్యత్తు కోసం శ్రమిస్తున్నా. మే 1న మా సినిమా విడుదల కానుంది. అందరూ చూసి ఎంజాయ్ చేయండి" అని తెలిపారు. ఇటీవల తాను సుమారు 3 వేల మంది అభిమానులను కలిశానని సూర్య గుర్తు చేశారు. అభిమానుల ప్రేమాభిమానాల వల్లే ఈ వయసులోనూ తాను ఎంతో యాక్టివ్గా ఉన్నానని చెప్పారు.

ఊర్వశీ రౌతేలా ఆలయం వ్యాఖ్యలపై టీమ్ క్లారిటీ..

ఊర్వశీ రౌతేలా వ్యాఖ్యలపై టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఆమె మాటలను సరిగ్గా అర్థం చేసుకోవాలని కోరింది.

బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా ఓ ఇంటర్వ్యూలో తన పేరుపై ఉన్న ఆలయం గురించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీసిన సంగతి తెలిసిందే. తాజాగా వీటిపై టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఆమె వ్యాఖ్యలను ప్రజలు తప్పుగా అర్థం చేసుకున్నారని పేర్కొంది. ఈమేరకు ఇన్స్టాలో పోస్టో వివరణ ఇచ్చింది. "ఊర్వశీ ఆ వీడియోలో మాట్లాడుతూ.. తన పేరు మీద ఆలయం ఉందని చెప్పారు. అది తన ఆలయం అని చెప్పలేదు. అందరూ ఆమె వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారు. దయచేసి వీడియో మరోసారి విని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఇక దిల్లీ యూనివర్సిటీలో నిజంగానే ఆమె ఫొటోకు దండలు వేసి పూజిస్తారు. దీనిపై గతంలోనూ కథనాలు వచ్చాయి. అవి ఇప్పటికీ అందుబాటులోనే ఉన్నాయి. నిరాధారమైన ఆరోపణలు, అవమానకరమైన వ్యాఖ్యలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలి. ప్రతిఒక్కరినీ గౌరవించాలి. వారి మాటలను సరిగ్గా అర్థం చేసుకోవాలి" అని టీమ్ పేర్కొంది. ఇక తాజా ఇంటర్వ్యూలో ఊర్వశీ మాట్లాడుతూ.. 'నా పేరు మీద ఓ ఆలయం ఉంది. బద్రీనాథ్‌కు ఎవరైనా వెళితే పక్కనే ఉన్న నా ఆలయాన్ని సందర్శించండి' అని అన్నారు. ఈ కామెంట్స్పై బద్రీనాథ్ సమీపంలోని ఆలయాల అర్చకులు మండిపడుతున్నారు. నటి ఊర్వశీ అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. బద్రీనాథ్ సమీపంలోని బామ్నిలో ఊర్వశీ పేరుతో ఆలయం ఉన్నమాట వాస్తవమేనని, అయితే, ఆ ఆలయానికీ, నటికి సంబంధం లేదని తెలిపారు.

ధోనీ ప్రస్తావన.. వద్దంటూ వారించిన అశ్విన్!

వరుసగా ఐదు మ్యాచుల తర్వాత చెన్నైకి విజయం దక్కింది. ఈ అంశంపై యూట్యూబ్ ఛానల్ లో నిర్వహించిన డిబేట్ ఇప్పుడు వైరల్‌గా మారింది.

భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మరోవైపు యూట్యూబ్లో చాలా యాక్టివ్గా ఉంటాడు. క్రికెట్ సంబంధిత నిపుణులతో పాటు చర్చల్లో పాల్గొంటాడు. అయితే, ఐపీఎల్ ప్రారంభానికి ముందు తన యూట్యూబ్ ఛానల్లో నూర్‌అహ్మద్ కొనుగోలుపై కొందరు విశ్లేషకులు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీంతో ఇకపై తన యూట్యూబ్లో సీఎస్కే సంబంధిత అంశాలపై చర్చించకూడదని నిర్ణయం తీసుకున్నాడు. తాజాగా ఓ డిబేట్లోనూ ప్యానలిస్ట్ ధోనీ, సీఎస్కే పేరును ప్రస్తావించాడు. వెంటనే అశ్విన్ వద్దంటూ వారించాడు. "మీరు విజయం సాధించినందుకు ఆనందంగా ఉంది. అశ్విన్.. నీకు నాయకత్వం వహించిన అనుభవం ఉంది. టీఎన్‌పీఎల్లో నీ జట్టును గెలిపించావు. నా లెక్క ప్రకారం ఇలాంటి నాయకత్వం చాలా అవసరం. ఆ నాయకుడు సంజు, శ్రేయస్, ధోనీలా ఉండాలి" అని ప్యానలిస్ట్ వ్యాఖ్యానించాడు. అప్పుడు అశ్విన్ స్పందిస్తూ "ష్.. ష్" అంటూ వారించాడు. దానికి ప్యానలిస్ట్ మాట్లాడుతూ.. "కాదు. మీరు అలా అనొద్దు. నేను మాట్లాడొచ్చు. ఇక్కడ నేను ప్రేక్షకుడిగా మాట్లాడతా" అని వ్యాఖ్యానించాడు. అశ్విన్ స్పందిస్తూ "నేను మాత్రం నా టీమ్ గురించి మాట్లాడలేను" అని చెప్పాడు. గత సీజన్ వరకు రాజస్థాన్ రాయల్స్కు ఆడినప్పుడూ ఇదే సూత్రం పాటించినట్లు అశ్విన్ గుర్తు చేసుకున్నాడు..

ఇంటి చిట్కాలు

ఇప్పుడు చెప్పే కొన్ని టీలు తాగితే సిరల్లో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ కరిగిపోతుంది, బరువు తగ్గడంతో పాటు గుండె కూడా పదిలం

చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే.. గుండె జబ్బులు, స్ట్రోక్, గుండెపోటు, హైపర్‌టెన్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇక, అధిక బరువు కూడా అనేక ఆరోగ్య సమస్యల్ని తెచ్చి పెడుతుంది. అందుకే చెడు కొలెస్ట్రాల్‌తో పాటు బరువు కూడా తగ్గాలి.

ఈ రోజుల్లో బిజీ లైఫ్‌స్టైల్, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా ఊబకాయం, కొలెస్ట్రాల్ సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. శరీరంలో కొలెస్ట్రాల్ ఉండటం మంచిదే. అయితే.. ఆ కొలెస్ట్రాల్ ఎక్కువ అయితే శరీరానికి ముప్పు పొంచి ఉంటుంది. చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే.. గుండె జబ్బులు, స్ట్రోక్, గుండెపోటు, హైపర్‌టెన్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇక, అధిక బరువు కూడా అనేక ఆరోగ్య సమస్యల్ని తెచ్చి పెడుతుంది. అందుకే చెడు కొలెస్ట్రాల్‌తో పాటు బరువు కూడా తగ్గాలి. ఇక, కొన్ని ఇంటి చిట్కాలు బరువు తగ్గించడానికి సాయపడతాయి. ఈ ఇంటి చిట్కాల్లో హెర్బల్ టీలు కూడా ఉన్నాయి. ఐదు హెర్బల్ టీలు రోజూ తాగితే చెడు కొలెస్ట్రాల్ కరగడంతో పాటు బరువు కూడా తగ్గవచ్చు. ఆ చిట్కాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.

అల్లం టీ



అల్లంలో ఉండే జింజెరాల్, షోగోల్, జింజెరోన్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు.. శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్స్‌గా పనిచేస్తాయి. అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు మెండుగా ఉంటాయి. అల్లంలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్ బీ3, బీ6, సీ, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, ఫాస్పరస్, జింక్, ఫోలేట్, నియాసిన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జింజెరాల్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీవక్రియను వేగవంతం చేస్తుంది. అల్లం బరువు తగ్గడానికి సాయపడే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటుంది. అల్లం టీ రోజూ తాగితే కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు బరువు కూడా తగ్గవచ్చంటున్నారు నిపుణులు.

గ్రీన్ టీ

గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు, పాలీ ఫెనాల్స్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్ లక్షణాలు, కెటాచిన్లు ఉంటాయి. ఇవి జీవక్రియను పెంచుతాయి. అంతేకాకుండా శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సాయపడతాయి. రోజూ గ్రీన్ టీ తాగడం వల్ల బరువు తగ్గవచ్చంటున్నారు నిపుణులు. అదనంగా గ్రీన్ టీలో ఉండే ఎపిగాల్లోకెటాచిన్ గాలెట్ కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో సాయపడుతుంది.

పుదీనా టీ

పుదీనా టీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కడుపులోని గ్యాస్ తగ్గించడానికి సాయపడుతుంది. పుదీనాలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు ఉన్నాయి. ఇవి యూరినరీ ఇన్ఫెక్షన్ల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఈ టీ తాగడం వల్ల మూత్ర విసర్జనకు సంబంధించిన అన్ని సమస్యలు సయమవుతాయి. ఇక, పుదీనా టీ రోజూ తాగితే బరువు తగ్గవచ్చు. పుదీనాలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల కారణంగా కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది.

దాల్చిన చెక్క టీ

దాల్చిన చెక్కలో ఆరోగ్యానికి మేలు చేసే అనేక పోషకాలు ఉన్నాయి. దాల్చిన చెక్క టీ రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రించడంలో సాయపడుతుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. బరువు తగ్గడంతో పాటు చెడు కొలెస్ట్రాల్ సమస్య కూడా నయమవుతుంది. ఇందుకోసం దాల్చిన చెక్కను పొడిలా చేసుకోండి. ఆ తర్వాత నీటిని తీసుకుని మరిగించి.. అందులో దాల్చిన చెక్క పొడిని కలపండి. ఆ తర్వాత ఫిల్టర్ చేసి గోరు వెచ్చగా తాగితే మంచి ఫలితం ఉంటుంది. ఈ టీని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగితే మంచిది.

తులసి టీ

తులసి టీలో అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి. తులసి టీ జీవక్రియను పెంచుతుంది. బరువు తగ్గడానికి సాయపడుతుంది. రోజూ తులసి టీ తాగితే కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. తులసి టీలో యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ వ్యాధుల్ని తగ్గించడంలో సాయపడతాయి.

హెర్బల్ టీలతో ప్రయోజనాలు



- జీర్ణక్రియ మెరుగుపడుతుంది
- జీవక్రియ వేగవంతం అవుతుంది.
- యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి
- ఒత్తిడి తగ్గి మానసిక ఆరోగ్యం మెరగవుతుంది.
- నిద్రలేమి సమస్యలతో బాధపడేవారికి మంచి ఆప్షన్. రోజూ ఈ టీలు తాగడం వల్ల హాయిగా నిద్రపోవచ్చు.
- రోజుకు రెండు సార్లు ఈ టీల్లో ఏదైనా ఒకటి తాగితే శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. గర్భిణీ స్త్రీలు, ఇతర వ్యాధులతో బాధపడేవారు డాక్టర్‌ని సంప్రదించి సలహా తీసుకోవడం మంచిది.

గమనిక

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.